

హత్య చేసినవారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సాగర్‌రహదారిపై రాస్తారోకో చేస్తున్న కేవీపీఎస్ నాయకులు


నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 3 డిసెంబర్ 2024 | RANGAREDDY


## నరేందర్ రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ ఈ నెల 5కు వాయిదా

### లగచర్ల రైతుల బెయిల్ పిటిషన్‌పై నేడు తీర్పు

వికారాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : లగచర్ల కేసులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈ నెల 5కు కోర్టు వాయిదా వేస్తూ వికారాబాద్ జిల్లా కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్ 13న నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. మరోవైపు లగచర్ల రైతుల బెయిల్ పిటిషన్‌పై వాదనలు పూర్తి కాగా తీర్పును వికారాబాద్ జిల్లా కోర్టు నేటికి వాయిదా వేసింది. లగచర్ల కేసులో రిమాండ్‌లో ఉన్న రైతుల్లో 21 మంది రైతుల బెయిల్ పిటిషన్‌పై న్యాయవాదులు జక్కుల లక్ష్మణ్, రామచంద్రారావులు వాదనలు వినిపించారు. అభిప్రాయం తీసుకోకుండానే భూములు ఇవ్వాలని రైతులపై ఒత్తిడి తెచ్చారని, భూములిచ్చేది లేదని చెప్పినా లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని, తనపై దాడి జరగలేదని కలెక్టర్ మీడియాతో తెలిపినప్పటికీ రైతులపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయడంపై కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు న్యాయవాదులు లక్ష్మణ్, రామచంద్రారావు తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటివరకు 71 మందిని గుర్తించగా, ఇప్పటివరకు 29 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# కారుతో గుద్ది.. కత్తితో గొంతుకోసి..

### ఇబ్రహీంపట్నంలో సంచలనం రేపిన హత్య..

### అక్కను నరికి చంపిన తమ్ముడు..

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 2 : ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్ గ్రామంలో జరిగిన కులోన్మాద హత్య సంచలనం రేపింది. సోమవారం ఉదయం హత్య జరిగిన విషయం తెలియడంతో పలువురు దిగ్భ్రాంతికి గురయ్యారు. సొంత అక్కను తమ్ముడు చంపిన విషయం తెలియడంతో రాయపోల్, పోల్కంపల్లి, దొండగూడ, మందగూడ, లింగంపల్లి, నాగన్‌పల్లి, దండుమైలారం, ముకునూరు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. తల్లిదండ్రులు చనిపోయినప్పటికీ నాగలక్ష్మి(26) పట్టుదలతో పోలీసుకానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది. అంతలోనే హత్యకు గురికావడం గ్రామవాసులను కలచివేసింది. కొంత కాలం క్రితం నాగలక్ష్మి తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు. నాగలక్ష్మికి ఒక అక్క, తమ్ముడు ఉన్నారు. తల్లిదండ్రులు చనిపోయినప్పటికీ పట్టుదలగా చదివి 2022బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికైంది. ఉద్యోగం చేస్తూనే అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్‌ను కులాంతర వివాహం చేసుకున్నది. ఇది నచ్చని ఆమె సోదరుడు పరమేశ్ ఆమెను ఎలాగైనా హత్య చేయాలని అనుకున్నాడు. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఒంటరిగా ఉద్యోగానికి వెళ్తున్న విషయం తెలుసుకున్న పరమేశ్ కారుతో ఆమెను వెనుకనుంచి ఢీకొట్టి.. కిందపడిపోగానే విచక్షణా రహితంగా కత్తితో గొంతుకోసి హత్య చేశాడు. ఈ ఉదంతంతో నాగలక్ష్మి భర్త శ్రీకాంత్ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. తమ భార్యను చంపిన ఆమె తమ్ముడు పరమేశ్‌ను కఠినంగా శిక్షించాలని, నేటికీ కులాల ప్రస్తావనతో హత్య చేయడం బాధాకరమని భర్త వాపోయాడు. శవపంచనామా పూర్తి చేసిన పోలీసులు మృతురాలు నాగలక్ష్మి మృతదేహాన్ని భర్త కుటుంబసభ్యులకు అందజేశారు. నాగలక్ష్మిని హత్య చేసిన ఆమె సోదరుడు పరమేశ్ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు తెలిసింది. హంతకుడిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామ్యూల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఎదుట సాగర్ రహదారిపై ధర్నా నిర్వహించారు.



శ్రీకాంత్, నాగలక్ష్మి పెండ్లిఫొటో



మీడియాతో మాట్లాడుతున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

# రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలి

### మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

### ఇటీవల రోడ్డు ప్రమాదంలో ప్రొద్దటూరు గ్రామానికి చెందిన భార్యభర్తలు మృతి

### నివాళులర్పించిన అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 2 : అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుండడంతోనే నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, తద్వారా ఎందరో తమ కుటుంబాలను కోల్పోతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరు గ్రామానికి చెందిన భార్యాభర్తలు మేకల లక్ష్మారెడ్డి, భాగ్యలక్ష్మి చేవెళ్ల మండల పరిధి మీర్జాగూడ గేట్ సమీపంలోని హైదరాబాద్ బీజాపూర్ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి సోమవారం ప్రొద్దటూరు గ్రామానికి వెళ్లి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు జాతీయ రహదారి నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయిందని, టెండర్ పూర్తై ఒకటిన్నర సంవత్సరాలు గడిచినా పనులు ప్రారంభం కాకపోవడం శోచనీయమన్నారు. అనునిత్యం ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతూ మృత్యువాతపడుతున్నారని అన్నారు. ఇప్పటికే వందలాది మంది ప్రాణాలు పోయాయని, రాజకీయాలు పక్కన పెట్టి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతానికి చెట్లు లేని చోట ముందుగా రోడ్డు పనులు ప్రారంభిస్తే కొంత మేరకు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉన్నదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పనులను ప్రారంభించాలన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి, శంకర్‌పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న దివ్యాంగులు

# పింఛన్లు పెంచుతామని వంచన చేశారు..

- దివ్యాంగులకు ఇచ్చిన హామీలు మరిచి విజయోత్సవాలు
- వారం రోజులుగా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్నా
- కన్నెత్తి చూడని కాంగ్రెస్ సర్కార్
- నేడు పింఛన్ల పెంపుపై రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు..
- సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రంగారెడ్డి జిల్లా దివ్యాంగులు
- నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

*'దివ్యాంగులపై కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూస్తున్నది.. సమస్యలు పరిష్కరించకపోగా, వారం రోజులుగా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేడు.. ఎన్నికలకు ముందు పింఛన్లు పెంచుతమని చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక కన్నెత్తి చూస్తలేదు.. రూ.4016 పింఛన్‌ను రూ.6వేలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్.. నోరెందుకు మెదపడం లేదు.. చెప్పిన మాటలు నీటిమూటలేనా.. నమ్మి ఓట్లేస్తే మొండి చేయి చూపుతరా.. మాకు దిక్కెవరూ..' అని రంగారెడ్డి జిల్లాలోని దివ్యాంగులు కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడుతున్నారు. నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తామని హెచ్చరించారు.*

*- రంగారెడ్డి, డిసెంబర్ 2 (నమస్తేతెలంగాణ)*

### పింఛన్లు పెంచే వరకు ఆందోళన కొనసాగిస్తాం..



దివ్యాంగుల పింఛన్ రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నది. దివ్యాంగులను అన్ని విధాలుగా ఆదుకుంటామని కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు దండుకున్నది. అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించిన పింఛన్లు కూడా ఇంకా అందలేదు. పింఛన్లు పెంచేవరకు ఆందోళన కొనసాగిస్తాం.

– ఆకుల సంజీవ, దివ్యాంగుడు

### జిల్లాలో 35వేల మంది దివ్యాంగులు..

రంగారెడ్డి జిల్లాలో 35,500 మంది దివ్యాంగులు ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా ఠంచన్‌గా పింఛన్లు వచ్చేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నదని జిల్లాలోని దివ్యాంగులు వాపోతున్నారు. అక్టోబర్ నెలకు సంబంధించిన పింఛన్లను మాత్రమే గత రెండురోజుల కింద విడుదల చేశారని, అదికూడా మున్సిపాలిటీల్లో నేటికీ విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ నెల పింఛన్లు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని వారు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఆందోళన బాట పట్టాల్సి వస్తున్నదని, స్పందించకపోతే నిరసనలను తీవ్రం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

### అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట నిరసనలు

**- కాళ్ల జంగయ్య, దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**



పింఛన్లు పెంచాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాలు చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదని, నేడు దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట నిరసనలు చేయాలని పిలుపునిచ్చినట్లు దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరగనున్న దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో కూడా తాము నిరసన వ్యక్తం చేస్తామని పేర్కొన్నారు.

### నేడు కేసీఆర్‌ను కలువనున్న దివ్యాంగులు..

దివ్యాంగుల పింఛన్ల పెంపు విషయంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తున్నందున మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలువనున్నట్లు కాళ్ల జంగయ్య తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నదని, భవిష్యత్తు ఆందోళన కార్యక్రమాలకు మద్దతు తెలుపాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కోరనున్నట్లు ఆయన వివరించారు.

## షాద్‌నగర్‌లో రిలే నిరాహార దీక్ష

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 2: ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగుల పింఛన్‌ను పెంచాలని దివ్యాంగుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం షాద్‌నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. పింఛన్ల పెంపు విషయంలో రాష్ట్ర సర్కార్ కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 2011 నుంచి దివ్యాంగులకు కేవలం రూ.300 ఇస్తున్నదని, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా రూ.3వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.6వేల పింఛన్‌ను త్వరగా అమలు చేయాలని, ఉచిత బస్సు సౌకర్యం, ఆర్థిక రుణాలు, ఉప పరికరాలు, డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రైవేటు సంస్థల్లో 5శాతం ఉద్యోగాలు దివ్యాంగులకు కేటాయించాలని కోరారు. అనంతరం ఆర్డీవో సరితకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల జాతీయ వేదిక నాయకులు రాజు, శేఖర్, కృష్ణయ్య, రమేశ్, సుగణయ్య, బేబీకాజు, షహీన్, ఓసియా బేగం, సంతోష, కుస్మా, మనీల, మల్లేశ్, శ్రీనాథ్, మసూద్, అంజయ్య, కిష్టయ్య, గఫర్, యాదయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ ఎంపీడీవో కార్యాలయ సమీపంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న దివ్యాంగులు

# మృత్యు శకటం

- కూరగాయల వ్యాపారులపైకి దూసుకెళ్లిన లారీ
- అక్కడికక్కడే నలుగురు మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- చేవెళ్ల మండలం ఆలూరు స్టేజీ వద్ద ఘటన

చేవెళ్ల రూరల్/ చేవెళ్ల టౌన్, డిసెంబర్ 2 : కూరగాయల వ్యాపారులపైకి లారీ రూపంలో మృత్యువు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. చేవెళ్ల మండలం ఆలూరు, నాంచేరు అనుబంధ గ్రామం ఇంద్రారెడ్డి నగర్‌కు చెందిన దాదాపు 25 మంది ఆలూరు స్టేజీ పక్కన కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలాగే సోమవారం కూడా కూరగాయలు అమ్ముతున్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి వికారాబాద్ వైపు వస్తున్న లారీ వేగంగా వారిపైకి దూసుకెళ్లింది. ఆలూరుకు చెందిన నక్కలపల్లి రాములు (40), దామరిగిద్ద కృష్ణ (22), ఇంద్రారెడ్డి నగర్‌కు చెందిన ఎస్.సుజాత (42)పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. వీరితో పాటు సెంట్రింగ్ పనిమీద స్కూటీపై వచ్చి ఆలూరు వద్ద టీ తాగేందుకు ఆగిన టోలిచౌకికి చెందిన జమీల్(26)ను ఢీకొట్టడంతో అతడు కూడా స్పాట్‌లోనే చనిపోయాడు. వీరితో పాటు ఇంద్రారెడ్డి నగర్‌కు చెందిన పద్మమ్మ, ఆలూరుకు చెందిన బాలమణి, అక్కడే జామకాయలు అమ్మే ఆంధ్రా ప్రాంతానికి చెందిన చల్లా మాల్యాద్రికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం, క్షతగాత్రులను చికిత్స కోసం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బండ్లగూడకు చెందిన లారీ డ్రైవర్ అమీర్ క్యాబిన్‌లో ఇరుక్కోవడంతో అతడికి రెండు కాళ్లు విరిగిపోయాయి. డ్రైవర్‌ను పోలీసులు బయటికి తీసి ఉస్మానియా దవాఖానకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్, ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య, ఇతర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని కలెక్టర్‌కు నివేదిక అందించారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి తదితరులు మృతదేహాలను సందర్శించి.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసులు గంటల తరబడి శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. వికారాబాద్ నుంచి వచ్చే వాహనాలను సిద్దులూర్ మీదుగా, పరిగి నుంచి వచ్చే వాహనాలను చిట్టంపల్లి గేట్ సమీపంలోని అంతారం మీదుగా మళ్లించారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను శంకర్‌పల్లి మీదుగా దారి మళ్లించారు.

### బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి..

**- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి**



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ప్రమాదం విషయం తెలుసుకున్న సబితారెడ్డి చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు వెళ్లి మృతదేహాలను సందర్శించి... కుటుంబ సభ్యులను పరామర్శించారు. గాయపడిన వారితోనూ ఆమె మాట్లాడి ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక నేతలతో ఘటనా స్థలాన్ని పరిశీలించి మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారందరూ కూరగాయలు అమ్ముకొని జీవించే సాధారణ రైతులేనని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బీజాపూర్ హైవేపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇంకెందరు చావాలని ప్రశ్నించారు. ఆదివారమే శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరుకు చెందిన దంపతులు దామరిగిద్ద వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయారని వాపోయారు. ఒక్క రోజులోనే మరో నలుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. అప్పా టు మన్నెగూడ వరకు రోడ్డు నిర్మాణానికి టెండర్లు వచ్చి ఏడాదిన్నర గడిచినా పనులు ప్రారంభించకపోవడం విడ్డూరమన్నారు. ప్రభుత్వం వెంటనే రోడ్డు పనులు మొదలు పెట్టాలని, లేదంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.